వైద్య సేవలకు ఆటంకం

- ఆందోళన బాటలో వైద్యులు..
- రోగులతో కిక్కిరిసిపోతున్న హాస్పిటల్స్
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు


వైద్యసేవల కోసం పీహెచ్‌సీకి వచ్చిన రోగులు

దాచేపల్లి: పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో వారు ఆందోళనబాట పట్టారు. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రబలడంతో వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పేదలు సర్కార్ హస్పిటల్స్‌కి వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సరీ్వస్ కోటా కుదింపును నిరసిస్తూ గత నాలుగు రోజులుగా పీహెచ్‌సీల వైద్యులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. దాచేపల్లి, నడికుడి, గామాలపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్క దాచేపల్లి పీహెచ్‌సీలోనే రోజుకి సగటున 200 వరకు ఓపీ వస్తుంది. ప్రస్తుతం టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్ గున్యాల బారినపడి ప్రజలు మంచమెక్కుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వైద్యులు ఆందోళనకు దిగడంతో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అక్కడ ఉన్న వైద్య సిబ్బంది తాత్కాలికంగా వైద్య సేవలు అందించి, పంపిస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు రోగులకు అందకపోవడం వల్ల కూటమి ప్రభుత్వం తీరుపై రోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకపోతే బుధవారం నుంచి నిరవధికదీక్షకు దిగుతామని డాక్టర్లు హెచ్చరించిన నేపథ్యంలో వైద్య సేవలు పూర్తిగా స్తంభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రైవేట్ హస్పిటల్స్‌కి వెళ్లి రూ.వేలకు వేలు చెల్లించక లేక రోగులు ప్రభుత్వ హస్పిటల్స్‌పైనే ఆధారపడ్డారు. ప్రస్తుతం వైద్యులు విధులకు రాకపోవడంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. ప్రైవేట్ హస్పిటల్స్ వెళ్లలేక... సర్కారీ హస్పిటల్స్‌లో వైద్య సేవలు అందక వారు పడుతున్న బాధలు వర్ణణాతీతం. ఇప్పటికైన ప్రభుత్వం వైద్యుల సమస్యలను పరిష్కరించి, పీహెచ్‌సీలకు పంపించాలని ప్రజలు కోరుతున్నారు.


వైద్యశాలలో మందుల కోసం క్యూ కట్టిన రోగులు

క్లుప్తంగా

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

దాచేపల్లి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 19 సంవత్సరాల లోపు వారికి నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. జీర్ణకోశ పేగుల్లో ఉండే నులి పురుగులు నివారణకు, శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ మాత్రలు పని చేస్తాయని వైద్య సిబ్బంది చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి, సీహెచ్‌వో కృష్ణకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మయ్య, గోవిందమ్మ, సరస్వతిదేవి, మేరి కుమారి పాల్గొన్నారు.

1 వరకు స్వచ్ఛతా హీ సేవా

పిడుగురాళ్ల: పట్టణంలో ఈ నెల 16 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రణాళిక బద్ధంగా నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. ప్రతి రోజు ప్రణాళిక ప్రకారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో శానిటేషన్‌తోపాటు అపరిశుభ్ర ప్రాంతాలను శుభ్రపరిచి స్వచ్ఛ పిడుగురాళ్లగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు.

పెరియార్‌కు నివాళి



మాచర్ల: సామాజిక ఉద్యమ కారుడు, సంఘ సంస్కర్త ఈవి పెరియార్ రామస్వామి నాయకర్ జయంతిని పట్టణంలో నిర్వహించారు. పెన్షనర్స్ భవనంలో దళిత సంఘాల నాయకులకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన పెరియార్ సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర జానపద కళాకారులు ఆదిరాల ఆదాం, వీరబ్రహ్మేంద్ర ప్రజా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గురజాల అప్పారావు, దళిత బహుజన బీమ్ సేన్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి, నాగేశ్వరరావు, ఆయా సంఘ నాయకులు తదితరులున్నారు.

పాస్టర్ కోటయ్య సేవలు మరువలేనివి



మాచర్ల: ఐదు దశాబ్దాల పాటు చర్చి పాస్టర్‌గా సీహెచ్ కోటయ్య సేవలు మరువలేనివని పాస్టర్లు రమేష్‌బాబు, పి.ఆనందరావు, సాగర్ కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం తెలుగు బాప్టిస్టు చర్చిలో ఏర్పాటు చేసిన కోటయ్య 4వ జ్ఞాపకార్థ కూడికలో పట్టణానికి చెందిన పలువురు చర్చి పాస్టర్లు హాజరై ప్రత్యేక సందేశాలిచ్చారు. పాస్టర్లు బాలయ్య, నాగెండ్ల విక్టరీ రాణి, కిన్నెర దానయ్య, బంకా యాకోబు, బాలరాజు, సంఘ కాపరి రవికుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



మాచవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. మాచవరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మానవహారం, ర్యాలీ చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి బప్పా మోరియా



మాచర్ల: వినాయక చవితి ఉత్సవాలు మంగళవారం 11వ రోజు ఘనంగా జరిగాయి. నిమజ్జనాన్ని పట్టణంలోని అన్ని ప్రాంతాల విగ్రహాలు తీసుకెళ్లారు. నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని నెహ్రూ నగర్ యూత్ ఊరేగింపు జరిపి తాళ్లపల్లి కుడి కాలువ నిమజ్జనం చేశారు. పట్టణంలోని పాత మాచర్లలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో సీతారామ ఆలయ గణపతి కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, 3వేల మందికి పైగా అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ సూరె యలమంద, ఆర్యవైశ్య నాయకులు కంభంపాటి అనిల్, అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మాశెట్టి సైదారావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఓరుగంటి పురుషోత్తం, దత్తులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి


ప్రత్యేక పూజలో తహసీల్దారు నగేష్

గురజాల : శ్రీమత్ గాయత్రి సమేత శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పులిపాడు రోడ్డులోని విశ్వకర్మ సంఘం కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ)సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దార్ కె.నగేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దారును విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాచర్ల: పాత మాచర్లలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో మాచర్ల విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతి యజ్ఞ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచే వందలాది మంది నగర సంకీర్తన ద్వారా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజా, పుణ్యావచనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, పంచ బ్రహ్మల కలశ స్థాపన చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పతాక ఆవిష్కరణ నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, విశ్వకర్మ భగవాన్ అందరికీ మంచి చేకూర్చాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బొర్రా నాగేశ్వరరావు, విశ్వ బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు పి.హనుమంతరావు, వీర ప్రసాద్, స్థానిక వైద్యులు కేపీ చారి, సంఘ అధ్యక్షులు కటకం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి మోహన్‌బాబు, సిద్ధయ్యచారి, మంగళగిరి శ్యాంసుందర్, సంబోతు వేణు, బాబు, ధవళేశ్వరపు రాంబాబు, వీరబ్రహ్మాచారి, చెన్నుపాటి రాంబాబు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేసి, లడ్డూ వేలం నిర్వహించారు.

ఇర్లపాడు చేపల చెరువు వేలంపాట

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు చేపల చెరువుకు మంగళవారం అధికారులు గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. 75 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుకు 2024–25, 2025–26 గడువు కాలానికి రూ.23,50,000లకు గ్రామానికి చెందిన పసల వెంకట సుబ్బారావు దక్కించుకున్నారు. వేలం పాటను ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఇన్‌చార్జి సర్పంచి గొల్లప్రోలు కోటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. వేలంలో ఎనిమిది మంది పాల్గొన్నారు. గడిచిన రెండేళ్లలో రూ.20.10 లక్షలకు గ్రామానికి చెందిన ఆలూరి సాంబశివరావు చేపల చెరువు సాగు చేసుకోగా, ప్రస్తుత వేలం ద్వారా రూ.3.40 లక్షలు అదనపు ఆదాయం లభించినట్లయింది. ప్రస్తుతం పాడిన పాటలో 3/4వ వంతు మొత్తాన్ని వేలం పాడిన రోజుననే, మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి మాధవి తెలిపారు.

కళాశాల స్థలాన్ని కాపాడండి



పిడుగురాళ్ల: కళాశాల స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తహసీల్దార్ మధుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని కొంత మంది అక్రమించుకోవాలని చూస్తున్నారని, రోడ్లు కూడా వేస్తున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఇంత వరకు ఎవరు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్త సాయి నాయక్, అమర్, గోపిచంద్, మంజు, మహేష్ పాల్గొన్నారు.

కరిముల్లా రచనలు మరచిపోలేనివి


'బదర్' పుస్తకం ఆవిష్కరణ

మాచర్ల: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన షేక్ కరిముల్లా ఆయన రచనలు ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని విశ్రాంత డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. పట్టణంలోని సోమవారం రాత్రి అబ్దుల్ కలాం సేవా సమితి కార్యాలయంలో బదర్ కవితలను ముద్రించిన సంచికను పలువురు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు పాషావలి మాట్లాడుతూ కరిముల్లా 26 రచనలు, ముద్రించిన 15 రచనలు గురించి వివరించారు. అతిథులు రామకృష్ణారావు, జలీల్, మదార్, పల్నాడు ప్రాంతమైన వినుకొండలో జన్మించి హెచ్ఎంగా పనిచేసి, పలు రచనలు పరిచయం చేశారన్నారు. 'బదర్' రచన పుస్తకాన్ని షేక్ గాలీబ్ సాహెబ్, కాశీపతి, పాండురంగారావు, గౌస్ మొహిద్దిన్‌తో పాటు పలువురు ఆవిష్కరించి, రచయిత కరిముల్లాకు అభినందనలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ వర్క్‌షాపు పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిఖిల్

పిడుగురాళ్ల: ఈ నెల 22న పిడుగురాళ్ల పట్టణంలో జరగనున్న ఫొటో గ్రాఫర్స్ వర్క్ షాపును విజయవంతం చేయాలని పిడుగురాళ్ల ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ సహకారంతో పిడుగురాళ్ల ఫొటో గ్రాఫర్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరగబోయే వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని, పల్నాడు జిల్లాల్లోని ప్రతి ఫొటో గ్రాఫర్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యరపతినేని సాయి నిఖిల్ చేతుల మీదుగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిడుగురాళ్ల ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య పెంపుదలపై శిక్షణ



మచవరం: సాంకేతికను వినియోగిస్తూ పత్తి పంటను సాగు చేసేవిధంగా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ బి. శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి నైపుణ్య పెంపుదల, యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు పురుగు ఉధ్రుతిని తెలుసుకునేందుకు ఎకరాకు 4 నుంచి 8 వరకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణా కో–ఆర్డినేటర్ ఎం.శివకుమారి, ఏఓలు కె.రామమ్మ, డి.పాపకుమారి, కె.దేవదాసు, వ్యవసాయ సహాయకులు నరసింహానాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

వెల్దుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ స్వచ్ఛత హీ పక్షోత్సవాలను అక్టోబర్ 2 వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలంటే షెడ్యూల్‌లోని కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ర్యాలీ నిర్వహించారు. అధికారులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దారు రాజశేఖర్ నాయక్, ఏఓ డి.ప్రసాద్, ఈఓపీఆర్డీ మకట్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బాలికలు రాణించడం అభినందనీయం


బాలికల జట్టుతో పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: జాతీయ క్రీడల్లో బాలికలు రాణించటం అభినందనీయమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థినుల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు బాలికల విభాగంలో సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో ఇంటర్ చదువుతున్న ముట్లూరి లూథియా, వేముల దివ్య, బి.దేవమణి, ఆర్.రత్నకీర్తన, యు.లలిత, సీహెచ్ హర్షిత, బి.రవళి క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ముట్లూరి లూథియా, బి.దేవమణి రాష్ట్ర జట్టుకు ఎంపికై ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు హరియాణాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. బి.దేవమణికి స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు, బెస్ట్ ప్లేయర్ అవార్డు దక్కిందన్నారు. క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ చూపించి పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ బాలికల జట్టును ప్రత్యేకంగా అభినందించారు.

జేఎన్‌టీయూఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం



నరసరావుపేట రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపా రు. రక్తం సరైన సమయంలో అందక అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు ఎంతోమంది ప్రా ణాలు కోల్పోతున్నారని తెలిపారు. శిబిరంలో వందమంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రా మ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు పాల్గొన్నారు.

శుభ్రతకు కేరాఫ్‌గా పిడుగురాళ్లను తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్


ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణాన్ని శుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ కోరారు. పట్టణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్రహ్మంగారి గుడి బజారు, జానపాడు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్, బుల్లి అబ్బాయి బజారు, హైస్కూల్ వెనుక వైపు, కేఎస్‌ఆర్ కాలేజీ సమీపం, గాంధీ నగర్ రైల్వే గేటు సమీపంలో డంప్ చేసే చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఏ రోజుకారోజు చెత్తను తొలగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. పుర వీధులన్ని శుభ్రంగా ఉంచేందుకు తమ వంతు విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వీధులు, నివాస ప్రాంతాల్లో చెత్త నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తొలంగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, సచివాలయ శానిటరీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత కోసం పాటుపడాలి


దాచేపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి: పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, దాచేపల్లిలో పలు వీధులను చీపురులతో శుభ్రం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో కూడా ర్యాలీ నిర్వహించారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉంటామని, అపరిశుభ్రంగా ఉంటే రోగాలబారిన పడతామని చెప్పారు. ఎంపీపీ కందుల జాను, సీఐ జి.వెంకట్రావ్, కమిషనర్ పాపారావు, వైస్ చైర్మన్లు కొమెర బత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్ బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, ఏపీవో మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్‌లు తంగెళ్ల శ్రీనివాసరావు, నాయకులు బెల్లంకొండ బద్రి, గొళ్ల నారాయణ పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని నర్సుల నిరసన

అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న నర్సులను పట్టించుకోకుండా ప్రభుత్వం నూతనంగా నంబరు 115 జీఓ పేరుతో తమకు అన్యాయం చేస్తోందని నర్సుల హక్కుల పోరాట కమిటీ నాయకులు ఎం.అన్నామేరి, శివరంజని, కామేశ్వరమ్మ అన్నారు. కొత్త వారిని పర్మినెంట్‌గా తీసుకోవటానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విధులు బహిష్కరించి, నల్ల బ్యాడ్జిలు ధరించి నర్సులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రులలో చాలీచాలని జీతాలతో పనిచేస్తుంటే ప్రభుత్వం తమ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. జీఓ నంబరు 115ను వెంటనే రద్దు చేసి, న్యాయం చేసి తమ పోస్టులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయ భానుకు వినతిపత్రం అందజేశారు. వీరి నిరసనకు మద్దతుగా వైద్యులు సంఘీభావాన్ని ప్రకటించారు. ఎస్టీ షాహిద్దీన్, డి.లక్ష్మి, జి.శకుంతల, కె.శ్రీలత, రజిత, సృజన పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

– మాచర్ల


ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సులు

ఆది గురువు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్


వీరబ్రహ్మేంద్రస్వామికి దుస్తులను అందజేస్తున్న యరపతినేని నిఖిల్, భక్తులు

పిడుగురాళ్ల: ఆది గురువు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ అని యరపతినేని నిఖిల్ అన్నారు. పట్టణంలోని బ్రహ్మంగారి దేవాలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం అంగరంగ వైభవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ సుతారు నాగ మల్లేశ్వరరావు సహకారంతో సుప్రభాత సేవ, విశ్వకర్మ పతాకావిష్కరణ, పూజా కార్యక్రమాలు, విశ్వకర్మ యజ్ఞాన్ని విశ్వశాంతి కోసం నిర్వహించారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని సాయి నిఖిల్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండలం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సుతారు నాగమల్లేశ్వరరావు, వల్లెం నర్సరయ్యచారి, వెంకటాచారి, లక్ష్మచారి, సైదాచారి, ఆంజనేయచారి, అమరలింగం, శివరామప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని వినతి

నరసరావుపేట: యలమంద గ్రామస్తుడు ఎస్.సుబ్బారావుపై దాడి చేసిన తెలుగుదేశం పార్టీ వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు అమలు చేయాలని మంగళవారం ప్రజాసంఘాల నాయకులు బాధితుడితో కలసి ఆర్డీఓ పి.సరోజనీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ తనపై జరిగిన దాడిని రూరల్ సీఐ, నేను గుంటూరులో ఉంటున్నానని, ఘటనపై తాను నాలుగు రకాలుగా చెప్పినట్లుగా అనటం సరైందికాదని అన్నారు.

గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన వద్దకు కానిస్టేబుల్ వచ్చి స్టేట్‌మెంట్ తీసుకొని ఎస్ఐ దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ వర్గీయులు ఇంటిపైన దాడిచేసి ఇల్లు ధ్వంసం చేయడంతో గ్రామం ఖాళీ చేసిన వారిలో తానూ ఉన్నానని, చల్లగుండ్ల, నరసరావుపేట ప్రాంతాల్లో ఉంటున్నానని చెప్పారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు నల్లపాటి రామారావు మాట్లాడుతూ జరిగిన ఘటనపై రూరల్ సీఐ బాధితులతో మాట్లాడకుండానే సుబ్బారావు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నాడని అనడం సరైంది కాదని అన్నారు. సుబ్బారావుపై దాడి చేసిన వాళ్లు ఎవరో తేల్చాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ పేద రజక కుటుంబానికి చెందిన సుబ్బారావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వ అధికారులు ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకి అనుకూలంగా కాకుండా న్యాయంగా వ్యవహరించాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, పౌరహక్కుల సంఘ జిల్లా జిల్లా నాయకులు శిఖినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.